క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



సుంకులాపరమేశ్వరీ దేవి

జూపాడుబంగ్లా: మండలంలోని పి.లింగాపురం గ్రామంలో వెలిసిన సుంకులాపరమేశ్వరీ దేవి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామంలో శిథిలమైన ఆలయాన్ని గతేడాది నూతనంగా నిర్మించి అమ్మవారి విగ్రహప్రతిష్ఠోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని నిర్మించి రెండేళ్లయిన సందర్భంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు

ఆత్మకూరు: మండలంలోని నల్లకాల్వ గ్రామ సమీపంలో వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి జయంతి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఉదయం 6 గంటలకు లక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవికి విశేష అభిషేకాలు, కుంకుమార్చన, ఉదయం 10 గంటలకు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తామని చెప్పారు. క్షేత్రంలో స్వామి వారు ముందు భాగంలో నరసింహస్వామిగా, వెనక భాగంలో శుభాకృతి కలిగి వెలిశాడని భక్తుల విశ్వాసం. ఇక్కడ పుష్యమాసం నుంచి ఆషాడ మాసం వరకు ప్రతిరోజు ఉదయం సూర్యకిరణాలు శ్రీలక్ష్మి నరసింహస్వామి విగ్రహంపై పడుతుండటంతో భక్తులు తరలివస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యం

మహానంది: ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా కృషి చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శివనారాయణ మాదిగ తెలిపారు. బండిఆత్మకూరులో మంగళవారం ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడిగా బాలస్వామి మాదిగ, ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడిగా సుకుమార్ మాదిగ, ఎంఎస్‌పీ అధ్యక్షుడిగా సామన్నతో పాటు ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఓబులేసు, ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూలసుబ్బన్న పాల్గొన్నారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐలు సుబ్రహ్మణ్యం, నాగభూషణం

ఆత్మకూరు: మండలంలోని సిద్ధాపురం గ్రామంలో సారా విక్రయించినా, తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు రూరల్, ఆత్మకూరు పట్టణ సీఐలు నాగభూషణం, సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో సారా కాచినా, తయారు చేసేలా ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సారా తీసుకెళ్లే ఐదు మోటార్‌సైకిళ్లను సీజ్ చేశారు. ఆత్మకూరు ఎస్‌ఐ వెంకటనారాయణరెడ్డి, పాములపాడు ఎస్‌ఐ అశోక్‌కుమార్, కొత్తపల్లి ఎస్‌ఐ హరిప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీకి తాగునీరివ్వండి



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న శివపురం ఎస్సీ కాలనీ వాసులు

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామం ఎస్సీ కాలనీలో నెల రోజులకు పైగా నీరు లేక అల్లాడుతుంటే అధికారులకు పట్టదా? అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వి.ఏసురత్నం, మండల కార్యదర్శి ఎస్.స్వాములు ప్రశ్నించారు. మంగళవారం ఎస్సీ కాలనీలో జీఎల్ఎస్ఆర్ ట్యాంకు వద్ద స్థానికులతో కలిసి ఖాళీ బిందెలు చేత పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి ఎస్సీ కాలనీకి నీటిని సరఫరా చేయాలని లేకపోతే డీఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు పి.చిన్నచిన్నయ్య, యేసమ్మ, మరియమ్మ, కాలనీవాసులు పాల్గొన్నారు.

తిరునాల ప్రారంభం

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో వెలసిన శివాలయంలో మంగళవారం ఈశ్వర స్వామి తరునాల ఘనంగా ప్రారంభం అయ్యింది. గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. అర్ధరాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పెళ్లిపందిరి వేశారు. పురోహితులు లాల్‌బహదూర్ శాస్త్రీ శివుడికి పాలాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన వంటి విశేష పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

పొదుపు మహిళలకు ఆసరా

- చివరి విడత ఆసరా సొమ్ము పంపిణీ
- ఈ నెల 15న పొదుపు సంఘాల ఖాతాల్లో నగదు జమ చేసిన ప్రభుత్వం
- మాట నిలుపుకున్న జగనన్న
- సంతోషం వ్యక్తం చేస్తున్న మహిళలు



ఆత్మకూరులో పొదుపు మహిళల సమావేశం (ఫైల్)

ఆత్మకూరు: అధికారంలోకి రాగానే పొదుపు మహిళల రుణాలు విడతల వారీగా మాఫీ చేస్తామని ప్రకటించారు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత పొదుపు మహిళలకు అండగా నిలవాలని, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని నిర్ణయించి వైఎస్సార్ ఆసరా పథకానికి శ్రీకారం చుట్టారు. మూడు విడతలుగా పథకం సొమ్ము మహిళల ఖాతాల్లో జమ చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చివరి విడతను ఈనెల 15వ తేదీన వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకుని మహిళల రుణాలను మాఫీ చేశారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.

లబ్ధిదారుల వివరాలు సేకరణ..

వైఎస్సార్ ఆసరా పథకం కింద ప్రభుత్వం అందించే చివరి విడత నగదు మంజూరుకు ప్రభుత్వం సిద్ధం కావడంతో వైకేపీ అధికారులు, సిబ్బంది పొదుపు మహిళా సంఘాల ఖాతాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచడమే కాకుండా బ్యాంక్ ఖాతా, వేలిముద్రలు సైతం సేకరించారు. దీంతో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమైంది.

గ్రామ సచివాలయాల్లో అర్హుల జాబితా

నాలుగో విడత చెల్లింపునకు అర్హులైన లబ్ధిదారుల జాబితాను వైకేపీ సిబ్బంది ఇప్పటికే అన్ని గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రదర్శనకు ఉంచారు. అయితే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆసరా పథకం కింద కొన్ని పొదుపు గ్రూపులకు రుణాలు అందకపోవడంతో పొదుపు మహిళలు ఆందోళనకు గురయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే ప్రభుత్వం నిధులను విడుదల చేయాలనుకుంది. అయితే ప్రతిపక్ష టీడీపీ నాయకులు నిధులు విడుదలగాకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఆసరా పథకం నిధులను జమ చేయవద్దని ఈసీ ఆదేశించింది. ఎన్నికలు ముగిసిన తర్వాత పెండింగ్‌లో ఉన్న అన్ని పథకాల సొమ్మును ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు.

మండలాల వారీగా చివరి విడత మంజూరైన లబ్ధిదారుల వివరాలు..

మండలం	పొదుపు సంఘాలు	మొత్తం సభ్యులు	మొత్తం నగదు
ఆత్మకూరు రూరల్	575	5480	రూ.27421849
ఆత్మకూరు అర్బన్	419	3850	రూ.18400000
బండిఆత్మకూరు	773	7980	రూ.49260804
మహానంది	666	6697	రూ.47249108
వెలుగోడు	879	8713	రూ.72666875
శ్రీశైలం	333	3136	రూ.18004110
మొత్తం గ్రూపులు :	3,645.	సభ్యులు:35,856.	మొత్తం నగదు : రూ.23,30,02,746

ఆసరా సొమ్ము అందించాం



ఈ నెలలో వైఎస్సార్ ఆసరా 4 విడత నగదును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారు. ప్రస్తుతం అన్ని పొదుపు సంఘాలకు వైఎస్సార్ ఆసరా కింద నిధులను పంపిణీ చేశాం. ఇప్పటికే ఇందుకు సంబంధించిన జాబితాను గ్రామ సచివాలయాల వద్ద, పొదుపు సంఘాల కార్యాలయాల వద్ద ప్రదర్శనకు ఉంచాం.

– ఉమామహేశ్వరి, ఏపీఎం, ఆత్మకూరు

మా గ్రూప్‌నకు రూ.40.90 లక్షలు మాఫీ అయ్యింది



మాది శ్రీరేణుక గ్రూప్. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసేటప్పటికి మా ఖాతాలో రూ.4.90 లక్షల అప్పు ఉంది. ఆ మొత్తం మాకు నాలుగు విడతల్లో మాఫీ చేశారు. ఇందులో నాకు రూ.49 వేలు మాఫీ అయ్యింది. మాట ఇచ్చి రుణ మాఫీ చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్న ఒక్కరే.

– లీలావతమ్మ, కరివేన

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



మాది కరివేన గ్రామం. మా గ్రూప్‌లో 13 మంది సభ్యులున్నారు. మా గ్రూప్‌నకు రూ.5.60 లక్షల రుణం మాఫీ అయ్యింది. ఇప్పటికే మూడు విడతల సొమ్ము మా ఖాతాలో జమైంది. ప్రస్తుతం చివరి విడత రూ.9,736 కూడా జమైందని అధికారులు తెలిపారు. ఇంత సొమ్ము రుణమాఫీ చేయడంతో మాకు ఆర్థికంగా ఇబ్బందులు తప్పాయి. అండగా నిలిచిన జగనన్నకు కృతజ్ఞతలు

– నారాయణమ్మ, కరివేన

నాణ్యత లేని విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ ఫణీశ్వర రెడ్డి

పాములపాడు: నాణ్యత లేని విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి హెచ్చరించారు. ఆయన మంగళవారం స్థానిక మన గ్రోమోర్, క్రిష్ణారావు పేటలోని శ్రీనివాస ట్రేడర్స్‌లో తనిఖీ చేశారు. క్రయ విక్రయాలకు సంబంధించిన పలు రికార్డులు తనిఖీ చేశారు. దుకాణంలో విక్రయించిన ప్రతి రకం విత్తనాలకు సంబంధించి రైతులకు రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. విత్తనాల విషయంలో ఎలాంటి లోపాలున్నా రైతులు తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని దుకాణ యజమానులను ఆదేశించారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా వ్యవసాయ అధికారులు దుకాణాలపై దాడులు నిర్వహించాలని సీపీఐ జిల్లా నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను ఆర్బీకేల ద్వారా సరఫరా చేయాలని కోరారు. నాయకులు మగ్బుల్, కిశోర్, నాగరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించండి



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీనరసింహ

మహానంది: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రణాళికలు రూపొందించాలని బండిఆత్మకూరు మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, కురుస్తున్న వర్షాలు, భారీ గాలులకు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్‌శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఏఈ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడిన అవరోధాలను వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. ఉపాధి పనులు గ్రామాల్లో కూలీలందరికీ కల్పించాలని కోరగా కల్పిస్తున్నామని సంబంధిత అధికారులు సమాధానమిచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కేవలం మూడు ప్రధాన అంశాలపై మాత్రమే చర్చించి సమావేశాన్ని ముగించారు. ఎంపీడీఓ విజయరావు, బండిఆత్మకూరు వైద్యాధికారిణి డాక్టర్ భావనారెడ్డి, వైస్ ఎంపీపీలు ముంతల మధురాణి, రాగాల వెంకటరమణ, సర్పంచ్‌లు రాధమ్మ, సంధ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నల్లమట్టి అక్రమ తవ్వకాలను అరికట్టండి



వీఆర్వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగేశ్వరరావు

పగిద్యాల: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా నల్లమట్టి తవ్వకాలు చేపట్టరాదని తహసీల్దార్ నాగేశ్వరరావు హెచ్చరించారు. ఆయన మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, దేవదాయ, చెక్ డ్యాం, చెరువులు, శివాయిజం, డీకేటీ, కాలువలు తదితర ప్రభుత్వ భూములు ఎవరి పరిధిలోకి వస్తాయో వారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందని వీఆర్వోలకు సూచించారు. నల్లమట్టి అవసరమయ్యే రైతులు ముందస్తుగా సంబంధిత శాఖ అధికారులకు అర్జీ పెట్టుకుని వారు నో అబ్జక్షన్ సర్టిఫికెట్ జారీ చేస్తే మైనింగ్ అధికారులకు క్యూబిక్ మీటర్ల చొప్పున చెలానా కట్టాలనే నిబంధనలు ఉన్నాయని వివరించారు. అందువల్ల నెహ్రూనగర్, పగిద్యాల, లక్ష్మాపురం, ప్రాతకోట, ఘణపురం, ముచ్చుమర్రి, సంకిరేణిపల్లె తదితర గ్రామాల్లోని మధ్యవర్తుల కనుసన్నల్లో నల్లమట్టిని అక్రమంగా తరలించి ధనార్జన సాగిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. అలాంటి వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునేలా ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. తక్షణమే వీఆర్వోలు అక్రమ మట్టి త్రవ్వకాలను అరికట్టడంపై దృష్టి సారించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, అలాగే నెహ్రూనగర్‌లో రైతులతో మాట్లాడి మట్టి తవ్వకాలపై నివేదిక ఇవ్వాలని ఇన్‌చార్జ్ ఆర్ఐ చంద్రమౌళి, వీఆర్వో వెంకటస్వామిని ఆదేశించారు. వీఆర్వోలు నాగన్న, నరసింహులు, వెంకటస్వామి, భగవాన్‌దాస్ తదితరులు ఉన్నారు.

ప్రాతకోటలో పోలీస్ కవాతు



ప్రాతకోటలో కవాతు చేస్తున్న పోలీసులు

పగిద్యాల: ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పడమర ప్రాతకోటలో మంగళవారం నందికొట్కూరు రూరల్ సీఐ విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. గ్రామంలోని కేసీ కెనాల్ బ్రిడ్జి నుంచి ప్రధాన రహదారి వెంట కవాతు కొనసాగింది. అనంతరం సీఐ మాట్లాడుతూ.. గ్రామంలో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు రోడ్లపై, ప్రధాన కూడళ్ల వద్ద, హోటల్స్ వద్ద గుంపులుగా ఉండరాదన్నారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ కొనసాగుతుందని ఏ చిన్న సంఘటన చోటుచేసుకున్నా ఉక్కుపాదం మోపుతామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని బెట్టింగ్ జోలికి వెళ్లరాదని సూచించారు. ముచ్చుమర్రి, బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐలు జయశేఖర్, నాగార్జున, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మద్దూరు గ్రామంలో ట్రాక్టర్‌తో సేద్యం చేస్తున్న రైతు

సేద్యానికి అదును

పాములపాడు: ఇటీవల కురిసిన వర్షాలకు భూములు అదును అయ్యాయి. దీంతో రైతన్నలు పొలాల్లో ట్రాక్టర్లతో సేద్యపు పనులు ముమ్మరం చేశారు. మండలంలో రైతులు మొక్కజొన్న పంటను అధికంగా సాగు చేస్తారు. ఖరీఫ్‌లో మొక్కజొన్న, రబీలో మినుము సాగు చేయడం పరిపాటిగా మారింది. పంట మార్పిడి చేయాలనే ఉద్దేశంతో రెండు సంవత్సరాల నుంచి సోయాబీన్ చిక్కుడు సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. గతేడాది పొగాకు పంటకు మంచి గిట్టుబాటు ధర ఉండటంతో రైతులు లాభాలు గడించారు. ఈ సంవత్సరం రైతులు ఎక్కువగా పొగాకును కూడా సాగు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆర్బీకేల్లో పచ్చిరొట్ట సాగుకు జీలుగలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయి. పిల్ల పెసర విత్తనాలు కూడా త్వరలో వచ్చే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. ఏదేమైనా ఈ సంవత్సరం ముందస్తు వర్షాలు రైతుకు ఆనందాన్నిచ్చాయి. దీంతో రైతులు ఉత్సాహంగా వ్యవసాయ పనుల్లో బిజీగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వైఎస్సార్ చేయూత నిధులు జమ

జూపాడుబంగ్లా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందకుండా అడుగడుగునా ప్రతిపక్షనేత చంద్రబాబు అడ్డుకోవటం పరిపాటిగా మారింది. ఎవ్వరు అడ్డుపడినా, ఎన్ని అవాంతరాలెదురైనా ఇచ్చిన మాట తప్పకుండా సీఎం జగనన్న సంక్షేమ పథకాలను అమలుచేస్తూ ప్రజల నమ్మకాన్ని పొందారు. ఈ ఏడాది మార్చిలో 'వైఎస్సార్ చేయూత' నిధులను అక్కా,చెల్లెమ్మల బ్యాంకు ఖాతాలకు మంజూరుచేయగా చంద్రబాబు అడ్డుతగిలి ఈసీకి ఫిర్యాదు చేయటంతో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధుల జమ ఆగిపోయింది. ఎన్నికల పోలింగ్ ముగియడంతో 45 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వయసున్న అక్కాచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో రూ.18,750 చొప్పున మండలంలోని 2,481 మందికి రూ.4,65,00,000 నగదును జమచేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగ విద్యార్థులు బడిలో చేరాలి



బానుముక్కలలో దివ్యాంగ విద్యార్థుల సర్వే చేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులు

పాములపాడు: దివ్యాంగ విద్యార్థులు బడిలో చేరాలని ఎంఈఓ బాలాజీనాయక్ సూచించారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుంచి సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు అధికారి ఆదేశానుసారం ప్రత్యేక ఉపాధ్యాయులు బడి బయట ఉన్న దివ్యాంగ విద్యార్థులను సర్వే చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా మండలంలో ప్రత్యేక ఉపాధ్యాయులు విజయ్‌బాబు, షంషుద్దీన్, రామమూర్తి ఇంటింటి సర్వే చేపట్టినట్లు చెప్పారు. పాఠశాలల్లో చేరని దివ్యాంగ విద్యార్థులను గుర్తించి ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు చెప్పారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

బనగానపల్లె రూరల్ : జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని ట్రైనీ డీఎస్పీ రఘువీర్ సూచించారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంట సీఐలు గంటా సుబ్బారావు, తిమ్మారెడ్డితో కలిసి పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తుల పై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఎన్నికల్లో గెలిచినవారు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, బాణా సంచాలు పేల్చేడానికి పోలీసులు అనుమతి లేదన్నారు. ఎవరైన శాంతిభద్రతకుల విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు రామిరెడ్డి, తిరుపాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి హోమాలు

నంద్యాల(అర్బన్): మిట్నాల గ్రామంలో వెలసిన అవధూత శివరామస్వామి ఆలయంలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు శ్రీపాద శ్రీవల్లభ జాతక గురుబల సిద్ధి వ్రతం, శ్రీదత్తాత్రేయస్వామి హోమాలు నిర్వహిస్తున్నట్లు శివరామస్వామి భక్త మండలి సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం గోపూజ, శ్రీలక్ష్మి గణపతి సహిత రుద్రహోమాలు ఉంటాయని, సాయంత్రం గ్రామ దేవతలకు నూతన పట్టువస్త్రాల సమర్పణ, ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు. గురువారం వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని ఉదయం గోపూజ, దత్త హోమాలు, మధ్యాహ్నం పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ చేపడతామని, సాయంత్రం దత్తాత్రేయ స్వామి వారి గ్రామోత్సవం ఉంటుందని వివరించారు.

24 నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

పగిద్యాల: ఈనెల 24వ తేది నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయని మండల విద్యాశాఖాధికారి సుభాన్ తెలిపారు. మంగళవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరానికి పదవ తరగతి పాఠ్య పుస్తకాలు మారుతాయన్నారు. అందువల్ల పది సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు ఫీజు చెల్లించకపోయినా విద్యార్థులను అనుమతించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ మేరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పగిద్యాల, పడమర ప్రాతకోట, లక్ష్మాపురం విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు

మహానంది: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల ఫీజులు చెల్లించని ఫెయిలైన విద్యార్థులు కూడా ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సప్లిమెంటరీ పరీక్షలు రాయొచ్చని బండిఆత్మకూరు ఎంఈఓలు మోహన్‌రెడ్డి, యశోధ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఫీజు చెల్లించకపోయినా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని బండిఆత్మకూరులోని ఏపీ మోడల్ స్కూల్ సెంటర్‌లో జరిగే పరీక్షలకు హాజరుకావచ్చని చెప్పారు. విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

నందికొట్కూరు రూరల్: పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థులు ఎలాంటి ఫీజు చెల్లించకపోయినా సప్లియెంటరీ పరీక్షలు రాయవచ్చని మండల విద్యాశాఖ అధికారిణి ఫైజున్నిసాబేగం తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు.

మిడుతూరు: పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులు ఫీజు చెల్లించకున్నా అనుమతిస్తారని ఎంఈఓ రామిరెడ్డి మంగళవారం తెలిపారు. ఎంఆర్‌సీ భవనంలో ఆయన మాట్లాడుతూ.. ఫెయిలైన ప్రతి విద్యార్థి పరీక్షా రాసేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

పాములపాడు:10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించకపోయినా విద్యార్థులు హాజరుకావచ్చని ఎంఈఓ బాలాజీనాయక్ తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 24 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

కమనీయం.. లక్ష్మీచెన్నకేశవుడి కల్యాణం





స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, కోట మాసమ్మకు వెండి తొడుగు బహుకరించిన దాత

మిడుతూరు: మండలకేంద్రంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం తెల్లవారుజామున శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణం కమనీయంగా సాగింది. వేదపండితులు సుబ్రమణ్యం శర్మ ఆధ్వర్యంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపంలో ఆశీనులు చేశారు. మేళతాళలతో భక్తజనుల గోవింద నామస్మరణ మధ్య కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు సోమవారం అర్ధరాత్రి నుంచి వరుడి అలంకరణలో స్వామివారిని పల్లకీలో పురవీధుల గుండా ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున 5.20 నిమిషాలకు మేష లగ్నంలో కల్యాణ వేడుక కమనీయంగా సాగింది. ఈఓ వెంకటరమణ, ఆలయ పురోహితులు వెంకట్రామయ్య, గ్రామ పెద్దలు తువ్వా శివరామకృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, బన్నూరు నాగిరెడ్డి, బన్నూరు శ్రీనివాసరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాహన సేవలు

కల్యాణ మహోత్సవం అనంతరం స్వామి అమ్మవార్లను ఉదయం శేషవాహనంపై, సాయంత్రం హనుమత్ వాహనంపై ఆశీనులను చేసి హనుమత్ ఉత్సవ కార్యక్రమాన్ని గ్రామ పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

కోట మాసమ్మకు వెండి తొడుగు బహూకరణ

మిడుతూరులో వెలసిన కోట మాసమ్మ అమ్మవారికి నంద్యాల పట్టణానికి చెందిన దూదేకుల సొకరాబి కూతురు హిమబిందు అనే భక్తురాలు రూ.లక్ష వ్యయంతో అమ్మవారికి వెండి తొడుగును బహూకరించినట్లు ఈఓ వెంకటరమణ తెలిపారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన



నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, నిమ్మ, వేప రసాలతో అభిషేకాలు చేసి పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలతో పూలంగి సేవ చేపట్టారు. అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం నిర్వహించి, 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. ఆలయం ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్ తిమ్మయ్య, నరసింహ పాల్గొన్నారు.

శ్రీకాళికాంబకు అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించిన దృశ్యం

ఆదిత్య పుష్పం



అందాలను ఆవిష్కరించడంలో ప్రకృతిని మించిన చిత్రకారులు లేరు. ఇక సూర్యోదయం, సూర్యాస్తమయం వేళల్లో ఆవిష్కృతమయ్యే అందాలు నిత్యనూతనం. మండలంలోని మసీదుపురం సమీపంలోని అస్తమిస్తున్న అరుణ వర్ణపు సూర్యుడు ఆకుల చివరన పుష్పంలా ఒదిగిపోయిన దృశ్యాన్ని మంగళవారం 'సాక్షి' కెమెరాలో బంధించింది.

– మహానంది